వర్షాకాలం నాటికి వరద కాలువ పనులు పూర్తి: ఎమ్మెల్యే



ఉదయ్‌నగర్‌లో వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, పద్మానగర్ కాలనీల్లో ఇప్పటికే ఎస్ఎన్‌డీపీ నిధులతో 90 శాతం పూర్తైన వరదనీటి కాలువ పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే వర్షాకాలం నాటికి వరద నీటి కాలువల పనులు పూర్తి అవుతాయన్నారు. సింగిరెడ్డి శివారెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలోని సూర్యానగర్ కాలనీ పరిధిలోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని త్వరలో ప్రత్యేక నిధులతో పార్కుగా తీర్చిదిద్దుతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, ఉమామహేశ్వర్, సదానంద్, చేగోని మల్లేష్‌గౌడ్, జగదీష్‌గౌడ్, శ్రీకాంత్, చందు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు యువత కృషి చేయాలి



మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ డిగ్రీ ఉమెన్స్ కళాశాల స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం వైబ్రంట్–2024 పేరుతో ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత లక్ష్యాను చేరుకునే దిశగా కృషి చేయాలన్నారు. సామాజిక సేవాదృక్పదం కలిగి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు తమ అనుభవాలను, తీపిగుర్తులను పంచుకున్నారు. మిస్ ఫేర్వెల్ కాంటెస్ట్, ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్కూల్ డీన్ భాగ్యలక్ష్మి, కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ హెడ్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురికాలనీ ఫేజ్–1లో శుక్రవారం షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన 22వ వార్షిక ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాలనీకి చెందిన పలువురు భక్తులు ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు లచ్చిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రావు, కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సాయిరాం, కనకరాజు, రమణ, శ్రీనివాస్‌రావు, శశిహరి, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

నూతన స్విఫ్ట్ అందుబాటులోకి రావడం సంతోషదాయకం

లింగోజిగూడ: అత్యాధునిక ఫీచర్స్‌తో తక్కువ ధర, ఎక్కువ మైలేజీతో నూతన స్విఫ్ట్ కారు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెలే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని ఆదర్శ మోటార్స్ షోరూంలో శుక్రవారం నూతన స్విఫ్ట్ కారును ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగ దారులకు సరసమైన ధరల్లో నాణ్యమైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ మోటార్స్ సీఈఓ నళినీకాంత్, జీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన స్విఫ్ట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బీడీరెడ్డి గార్డెన్ చౌరస్తాలో నిత్యం ట్రా'ఫికర్'



బీడీరెడ్డి గార్డెన్ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బీడీరెడ్డి గార్డెన్ (తెలంగాణ) చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చౌరస్తాలో నలువైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండటం, అక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సరైన పోలీస్ వ్యవస్థ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు గంటల కొద్దీ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. వాహనదారులు ఎవరికి వారు ఉన్న కొద్ది స్థలం నుంచి దూసుకుపోవడానికి ప్రయత్నించడంతో మరింత ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో వాహనదారుల మధ్య తరచూ వాగ్వావాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు వాహనదారులు చొరవ తీసుకుని వాహనాలను క్రమబద్ధీకరించాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వామ్మో... డేంజర్ హోల్స్!

- మ్యాన్‌హోళ్ల మరమ్మతులపై అధికారుల నిర్లక్ష్యం
- అవస్థలు పడుతున్న జనం



వరద కాలువ నాలాపై పగిలిన మ్యాన్‌హోల్

ఎల్‌బీనగర్: శాఖల మధ్య సమన్వయం లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. పగిలిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించాల్సిన అధికారులు.. ఇది తమ పని కాదంటే.. తమ పని కాదంటూ తప్పించుకుంటున్నారు. ఇలా ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులు మ్యాన్‌హోళ్ల పనులు చేపట్టకపోవడంతో జనానికి అవస్థలు తప్పడం లేదు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో మ్యాన్‌హోళ్ల నోళ్లు తెరిచి ఉండటంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు వర్షాకాలం ముంచుకొస్తుంటే అధికారులు మాత్రం నిద్రావస్థను వీడటం లేదు. ఇంజినీరింగ్ అధికారులు గుంతలను, నోళ్లు తెరుచుకున్న మ్యాన్‌హోళ్లను ఎందుకు పట్టించుకోవడం లేదని జనం విమర్శిస్తున్నారు. ప్రతి సంవత్సరం మ్యాన్‌హోళ్ల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ.. మ్యాన్‌హోళ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. పలు కాలనీల్లో మ్యాన్ హోళ్లకు మూతలు లేవు. మరికొన్ని కాలనీల్లో మ్యాన్ హోళ్లు రోడ్డుకు ఎత్తులో, మరికొన్ని కాలనీల్లో కిందికి ఉండటంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. మ్యాన్‌హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్తున్న అధికారులు అలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలుస్తోంది.

కార్యాలయాలకే ఇంజినీరింగ్ అధికారులు పరిమితం..

మూడు సర్కిళ్ల పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు సర్కిల్ కార్యాలయానికి పరిమితం కావడంతో ఎక్కడ వరద కాలువ నాలాపై మ్యాన్ హోళ్లు పగిలాయో, ఎక్కడ మూతలు లేకుండా ఉన్నాయనేది వారికి తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. కమీషన్లపై ఉన్న శ్రద్ధ మ్యాన్‌హోళ్లపై లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వరద కాలువ నాలా ఉన్న కాలనీలో మూతలు పగలడంతో కొత్తగా వాటికి మరమ్మతులు చేయకపోవడం వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవతున్నారు. మరికొన్ని కాలనీల్లో ఉన్నా.. అవి కుంగిపోతున్నాయి. అధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మా పరిధిలోకి వస్తే పనులు చేయిస్తాం..

పగిలిన మ్యాన్‌హోళ్లు వాటర్ వర్క్స్ పరిధిలోకి వస్తాయా లేదా? ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోకి వస్తాయా? అనే విషయం తెలుసుకుంటాం. మా పరిధిలోకి వస్తే వెంటనే మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం. వెంటనే సంబంధిత అధికారులను పంపి వరద కాలువ నాలా అయితే వెంటనే మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎల్‌బీనగర్ సర్కిల్ ఈఈ కోటేశ్వరావు

కూరగాయల మండీ.. అపరిశుభ్రత దండి!



డంపింగ్ యార్డును తలపిస్తున్న మాదన్నపేట మండీ



కూలేందుకు సిద్ధంగా ఉన్న షెడ్డు

- మాదన్నపేట మార్కెట్‌లో జాడలేని పారిశుద్ధ్య నిర్వహణ
- వర్షానికి చిత్తడిగా మారిన మైదానం
- రోగాల బారిన రైతులు, వ్యాపారులు

చంచల్‌గూడ: చెత్తా చెదారం జడలు విప్పి రైతులు, వ్యాపారులు, వినియోగదారులపై ఒకపక్క విషం చిమ్ముతుంటే.. మరో పక్క వర్షానికి చిత్తడిగా మారి నడవలేని పరిస్థితి ఏర్పడింది. కుర్మగూడ డివిజన్‌లోని మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లోని అపరిశుభ్ర పరిస్థితి ఇదీ. గురువారం కురిసిన వానకు మార్కెట్ దారులన్నీ బురదతో పేరుకుపోయాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఎక్కడికక్కడ వరద నీరు నిలిచిపోయింది. గంటల వ్యవధిలోనే మార్కెట్ మురికి కుంటలా మారింది.

దుర్వాసనతో సహవాసం..

మండీలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించాలని పదేళ్ల పాటు గత ప్రభుత్వానికి ఎన్ని విన్నపాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త తరలింపునకు జీహెచ్‌ఎంసీ విముఖత...

జీహెచ్‌ఎంసీ శాఖ మార్కెట్ యాజమాన్యం పెద్ద మొత్తంలో బకాయి ఉన్నట్లు సమాచారం. దీంతో మార్కెట్‌లో చెత్త తరలింపుపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదు. కొన్నేళ్ల నుంచి స్వచ్ఛందంగా ఆకు కూరల వ్యాపారులు, రైతులు డబ్బులు పోగు చేసి చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటున్నారు.

వసూళ్లకే మార్కెట్ కమిటీ పరిమితం...

కమీషన్ ఏజెంట్ వ్యవస్థ ద్వారా రైతుల నుంచి వచ్చే ఆదాయంపైనే మార్కెట్ కమిటీ దృష్టి పెడుతున్నది కానీ, చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవడం లేదు. చెత్త తరలింపు విషయంలో వ్యవసాయ మార్కెట్ శాఖ, జీహెచ్‌ఎంసీ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వానికి కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ ద్వారా నెలకు లక్షల రూపాయల ఆదాయం వస్తున్నా..మండీలోని రైతుల సంక్షేమం, కనీస సౌకర్యాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం శోచనీయం.

ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళన..



మాదన్నపేట మండీ లో దశాబ్దాలుగా రైతులు ఎన్నో కష్టాలకోర్చుతున్నారు. కోరి తెచ్చుకున్న తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినా రైతులకు సుఖం లేదు. మార్కెట్లపై ప్రభుత్వ ఆజమాయిషీ కరువైంది. మురుగు నడుమ రైతులు కూరలు విక్రయించాల్సిన దుస్థితి ఉంది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండీ యాజమాన్యం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేదు. మార్కెట్ అభివృద్ధిని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, సరైన రోడ్లు లేవు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం.

– రాంరెడ్డి, రైతు సంఘం నేత

పరిష్కారం చూపాలి..



మండీలోని దుర్వాసనతో సహజీవనం చేస్తున్నాం. పట్టించుకునే వారే కరువయ్యారు. మండీలో పారిశుద్ధ్యంలోపించడంతో అంటు రోగాలు ప్రబలుతున్నాయి. ఈ సమస్యకు ప్రభుత్వమే పరిష్కారం చూపాలి. మార్కెట్ యాజమాన్యం మార్కెట్ అభివృద్ధికి సహకరించడం లేదు. ప్రభుత్వ పట్టించుకోవడం లేదు. షెడ్డులు పాడైపోయాయి కూలే స్థితిలో ఉన్నాయి. షెడ్డు కూలి ఎవరికైనా ప్రాణనష్టం జరిగితే మార్కెట్ యాజమాన్యం బాధ్యత వహించాలి.

– రమేష్, ఆకు కూరల వ్యాపారి

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో..రూపాయల్లో) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 33, ఆలు 28, ఉల్లి 22, గోకర 40, దోస 25, సొర 11, పొట్ల 15, అరటి 8, చిక్కుడు 65, అర్వి 45, మునగ 35, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 45. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



చైతన్యపురి: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ మధురాపురిలోని స్వర్ణకార వీధిలో నిర్వహించే ఆరాధనోత్సవాల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. అందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అష్టలక్ష్మికి మొక్కులు తీర్చుకున్న సబితారెడ్డి



అష్టలక్ష్మి గుడిలో పూజలు చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. 21 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు అష్టలక్ష్మి ఆలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా ఆమెకు స్వాగతం పలికారు. పూజల తర్వాత ఎమ్మెల్యే ఆలయం పరిధిలోని అన్న ప్రసాద శాలను, నిత్య అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు అరవింద శర్మ, పెండ్యాల నగేష్, ఊర్మిళారెడ్డి పటేల్ సునీతారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని...

భర్త ఇంటి వద్ద మహిళ ఆందోళన

చైతన్యపురి: పెళ్లైన విషయం చెప్పకుండా తనను వివాహం చేసుకుని మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ భర్త ఇంటి వద్ద ఆందోళనకు చేపట్టింది. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. బాధితురాలు, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన లావణ్య సనత్‌నగర్‌లో నివసిస్తోంది. దిల్‌సుఖ్‌నగర్ పీ అండ్ టీ కాలనీకి చెందిన స్పీచ్ థెరపిస్ట్ కై కాల మధుతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి ఇద్దరూ రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక పాప పుట్టింది. అయితే మధుకు అప్పటికే వివాహం జరిగిందని, మొదటి భార్య చనిపోతే ఆమె చెల్లెలు హారికను వివాహం చేసుకున్నాడని, ఇంటర్ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉందని లావణ్యకు తెలిసింది. మధుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని పేర్కొంటూ శుక్రవారం అతడి ఇంటి ముందు ఆందోళనకు దిగింది. కాగా, మధు రెండో భార్య తమ ఇంటి ముందు న్యూసెన్స్ చేస్తోందని, ఆమెను హారిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. బాధితురాలు లావణ్య, మధు భార్య హారిక తమకు ఫిర్యాదు చేశారని, పూర్తి విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, తనకు, తన కుమార్తెకు తగిన న్యాయం చేయాలని లావణ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరింది. తన భర్త మధు అప్పటికే వివాహమై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న విషయం తనకు చెప్పలేదని, తనను మోసం చేసిన అతడిని పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది.

ఆడుకుంటూ మృత్యు ఒడికి...

పిల్లర్ గుంతలో పడి బాలుడి మృతి



మనోజ్ మృతదేహం

హస్తినాపురం: ఆడుకుంటూ వెళ్లిన బాలుడు బహిరంగ ప్రదేశంలో తవ్విన పిల్లర్ గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా సీఎస్ పురం మండలానికి చెందిన మాదాల అచ్చమ్మ, మాల్యాద్రి దంపతులు మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం నగరానికి వచ్చి వనస్థలిపురంలోని శ్రీనివాసపురం కాలనీలో ఉంటున్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బహిరంగ ప్రదేశంలో ఉన్న పిల్లర్ గుంత వర్షపు నీటితో నిండిపోయింది. మాల్యాద్రి కుమారుడు మనోజ్(8) శుక్రవారం ఆడుకుంటూ వెళ్లి ఆ గుంతలో పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే బాలుడిని గుంతలోంచి బయటికి తీసి వనస్థలిపురం ఏరియా ఆ సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వెల్లడించారు. బహిరంగ ప్రదేశంలో వేసిన గుంత కారణంగా మనోజ్ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

తుర్కయంజాల్: దశల వారీగా వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఆయన సాగర్ రహదారి నుంచి నవభారత్ కాలనీ, రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ వరకు రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీ, సరస్వతి కాలనీలో చేపడుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. సాయిరాంనగర్, చంపాపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు అర గంటపాటు సాయిరాం నగర్, గ్రీన్‌పార్కు, శ్రీరాంనగర్, ప్రెస్, సాయి తిరుమల, ఎస్‌వీఆర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అదే విధంగా ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు పటేల్‌నగర్, వైశాలీనగర్, నాగార్జున, శిఖరా ఎన్‌క్లేవ్, ఆర్‌టీసీ, భానునగర్, ఎస్ఎన్ రెడ్డి, కేశవనగర్, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ...

సైదాబాద్: పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఈ కింద తెలిపిన ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు: శ్రీకార్ హోటల్, భోజిరెడ్డి కాలేజ్, గణేష్ టెంపుల్, వినయ్‌నగర్, పూసలబస్తీ, ఇండియన్ పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాలు

ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు...

మలక్‌పేట గంజ్, ప్రేమలతా కాలనీ, అజీజ్‌పాషా, గంజ్ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, చర్మాస్ లేన్ ఎదురు ప్రాంతాలు.

ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు...

డాన్ స్కూల్, బీబీ కేన్సర్ హాస్పిటల్, ఇబ్రహీం ఫంక్షన్ హాల్, మౌలీ కా మాస్క్, బాబూ మియా గిర్ని, భూలక్ష్మీనగర్, తిరుమల హిల్స్, గడ్డిఅన్నారం, కల్యాణ్ నగర్, రెడ్‌క్రాస్, గౌతంనగర్, చర్చి, శాంతినగర్, లలితానగర్, మధురాపురి, కృష్ణానగర్, మారుతీనగర్, శంకేశ్వరబజార్, సరస్వతీనగర్, కోదండరామనగర్, సాహితీ నగర్, సన్‌షైన్ కాలనీ పరిసర ప్రాంతాలు

ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు...

ఐబీపీ పెట్రోల్ పంప్ ఐఎస్ సదన్ క్రాస్‌రోడ్, కరణ్‌బాగ్, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతీ కల్యాణ మండపం, సాయిరాం కాలనీ, స్టాన్లీ స్కూల్, దర్గా ఏ ఉజాలేషా, జీవన్‌జంగ్ కాలనీ, డీ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మలక్‌పేట: ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రేష్ఠ శ్రీ కమలా ఆస్పత్రిలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, డెంటల్ సమస్యలపై ఉచిత సంప్రదింపులు, ఫైబ్రో స్కాన్, 50 ఏళ్లకు పైబడిన వారికి బీఎండీ, ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. పేర్లు నమోదుకు 040–27766 1188, 89089 01188 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

చెట్లకొమ్మలను వెంటనే తొలగించండి

నాగోలు: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో గురువారం కురిసిన వర్షానికి రోడ్లపై పడిన చెట్లు కొమ్మలను వెంటనే తొలగించాలని హార్టికల్చర్ అధికారులకు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ సూచించారు. శుక్రవారం ఆమె డివిజన్‌లోని వివిధ కాలనీల్లో పర్యటించారు. వర్షానికి బీకేరెడ్డి నగర్‌లో రోడ్లపై పడిన కొమ్మలను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా కొమ్మలను వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. అనంతరం బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్‌లో పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే ఆ సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

వీసీల నియామకంలో బీసీలకు అవకాశం కల్పించాలి

దుర్గయ్య గౌడ్, రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు



హస్తినాపురం: తెలంగాణాలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల (వీసీ) నియామకంలో బీసీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ, రాష్ట్రంలోని వర్సిటీల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, విద్యావ్యవస్థను పటిష్టపర్చాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ఆయా విద్యాసంస్థలు, స్కూళ్లలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు వంటివి ఎక్కువ ధరలకు విక్రయించడాన్ని అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని, ఇలాంటి విద్యాసంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని దుర్గయ్య గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పండ్ల దుకాణాలను తొలగించాలని వినతి

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న పండ్ల దుకాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, పన్నాల మధుసూదన్ రెడ్డిలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గతంలో ఈ దుకాణాలు బీఎన్ రెడ్డి నగర్ నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు ఉండేవని, అక్కడ జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు వాటిని పూర్తిగా తొలగించారన్నారు. నూతనంగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాల వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

నేడు మండల సమావేశం

తలకొండపల్లి: మండల సర్వ సభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B. NAGAR

A.S. No. 65 of 2023

Between:

A. Om Kumar, ... Appellant

And

1. Bangari Babu Rao, and Others ... Respondents

P. Shiva Prasad, S/o P.Shankaraiah, Aged about 54 years, Occ: Pvt. Service, R/o H.No.16-2-146/1A/A/1, Malakpet, Hyde rabad. (Respondent No.7)

the above named Petitioners have preferred the above Appeal against Judgment and Decree in OS No. 411 of 2010 on the file of Hon'ble I Senior Civil Judge Ranga Reddy District. The case is posted to 11.06.2024 for your appearance. You are hereby directed to appear on that day at 10.30 a.m. before the Hon'ble Court either in person or through Advocate, failing which the matter will be decided exparte.

(BY THE ORDER OF HON'BLE COURT)

D.MANI KUMAR, Advocate
G-1,CETS Apartment, Chaitanyapuri, Hyderabad - 500 060.
(COUNSEL FOR THE PLAINTIFFS)